## క్లుప్తంగా

### హెచ్ఐవీపై అవగాహన

పిట్లం(జుక్కల్): అన్నారం అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం ఎన్జీవో ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఎన్జీవో కార్యకర్తలు రోజా, పరమేశ్వరి, నజియాలు సెంటర్ పరిధిలోని మహిళలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించి, తగు సూచనలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం గ్రామంలోని పలువురి రక్త నమూనాలు సేకరించారు. అంగన్‌వాడి కార్యకర్త అనురాధ, ఆశావర్కర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### అపరిచిత వ్యక్తులను నమ్మొద్దు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అపరిచిత వ్యక్తులను నమ్మొద్దని, సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాల గురించి చెప్పారు. పోలీస్ సిబ్బంది రవి, అంజి, మౌనిక పాల్గొన్నారు.

### బాధితులకు ఆపన్న హస్తం



బీబీపేట: విద్యుదాఘాతంతో ఐదు నివాసపు గుడిసెలు దగ్ధమై సర్వం కోల్పోయిన మాందాపూర్ గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలకు ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి భరోసా కల్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం కల్పించడంతో వారికి ఇంటి నిర్మాణాలు చేపడుతామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా గ్రామానికి చెందిన జై భవాని యూత్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు ఒక్కో కుటుంబానికి దుప్పట్లు, స్వెట్టర్లు, బట్టలు, నిత్యావసర సరుకులు, గ్యాస్ పొయ్యి, బియ్యాన్ని అందజేశారు. యూత్ సభ్యులు, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### పీఆర్‌టీయూ తెలంగాణ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: పీఆర్‌టీయూ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడిగా అంబీర్ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శిగా జనపాల లక్ష్మీ రాజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.నర్సింగరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలు, పెండింగ్ బిల్లుల విడుదల కోసం శాసనసభ ఎన్నికల అనంతరం పరిష్కారమయ్యే విధంగా కొత్త ప్రభుత్వానికి విన్నవించాలని తీర్మానించారు. డిసెంబర్ 1న ఎన్నికల సిబ్బందికి సాధారణ సెలవు ప్రకటించాలని కోరారు. యూనియన్ బాధ్యులు ప్రభాకర్, లెనిన్, సురేందర్, నర్సింగరావు, ఆనంద్, శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా పోలీస్ అబ్జర్వర్ అబ్దుల్ ఖయ్యూం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోని వసతుల సందర్భంగా ఆయన ఆరా తీశారు. దీంతోపాటు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. గోపాల్‌పేట హైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, సీఆర్పీ రాజయ్య ఉన్నారు.

### సెల్‌ఫోన్‌ల అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులకు ఎస్సై గణేష్ మంగళవారం సెల్‌ఫోన్లను అందించారు. పట్టణానికి చెందిన జంగం రాజు, బాలరాజులు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోవడంతో వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితులకు అందించారు.

### 'బీసీని సీఎం చేసేందుకు బీజేపీని గెలిపించాలి'

కామారెడ్డి అర్బన్: బీసీని సీఎం చేసేందుకు బీజేపీకి ఓటేసి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్నరాజులు అన్నారు. మంగళవారం దేవునిపల్లి వరి కొనుగోలు కేంద్రం, బీడీ కాలనీల్లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై నిత్యం గొంతెత్తి ఉద్యమించిన కాటిపల్లి వెంకటరమణా రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ నాయకులు టి.బాల్‌కిషన్, కాసర్ల రాజలింగం, టి.సతీష్‌చారి, చిన్నోల్ల రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులే

- కత్తిపోట్లు, దౌర్జన్యాలు పెరిగిపోతాయి
- ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్



మహిళలను ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం ఆయన మోతె, గాంధీనగర్, బూరుగిద్ద, ఎల్లారం, ముస్తాపూర్, కొయ్యగుండు తండా, ఒంటర్‌పల్లి, సురాయిపల్లి, కోమట్‌పల్లి, పోతాయిపల్లి, కన్నాపూర్, పొల్కంపేట, బోనాల్, మెంగారం, బాయంపల్లి, బాణాపూర్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే కొట్లాటలు, కుమ్ములాటలు, కత్తిపోట్లు, దౌర్జన్యాలు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో పదేళ్ల రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేయడానికి కార్యకర్తలు లేక ఇతర జిల్లాల నుంచి జీతం ఇచ్చి తెప్పించుకొని ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి పనికి రారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఓడిపోతామనే భయంతో దాడులకు పాల్పడుతున్నట్లు విమర్శించారు. ప్రతీ గ్రామంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. స్థానికంగా ఉండే నాయకుడికి ఓటేయాలన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిమ్మోజీవాడి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మంగళవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ పొన్న స్వప్న, ఉప సర్పంచ్ సాకలి రాజన్న, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పొన్న పెద్ద నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

# బీఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కైలాస్ నేత



మాట్లాడుతున్న కైలాస్ నేత

కామారెడ్డి టౌన్: తెలంగాణలో బీఆర్‌ఎస్ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని, ఇక ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కైలాస్ నేత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. మద్యం, డబ్బులు లేకుండా కామారెడ్డిలో బీఆర్‌ఎస్ ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేశారు. రాష్ట్రానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వం ఎంతైనా అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రజాక్, కౌన్సిలర్ పాత శివకృష్ణమూర్తి, తదితరులున్నారు.

### 6 గ్యారంటీలతో ప్రజలకు భరోసా



భిక్కనూరు: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై భరోసా ఏర్పడిందని ఆ పార్టీ భిక్కనూరు ఇన్‌చార్జి నేరెళ్ల శారద అన్నారు. మంగళవారం ఆమె భిక్కనూరు మండల కేంద్రంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని, ఆ పార్టీ కార్యకర్తలే కోట్లకు పడగలెత్తారన్నారు. పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు బల్యాల రేఖ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల ప్రచారం



దోమకొండ/కామారెడ్డి రూరల్: దోమకొండ, కామారెడ్డి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. రేవంత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికి ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేశారు.

# కేసీఆర్‌ను రికార్డు మెజార్టీతో గెలిపించాలి



కామారెడ్డిటౌన్ విద్యానగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు..



దోమకొండలో ..



భిక్కనూరులో..



రెడ్డిపేటలో ..



లింగాపూర్‌లో ..

కామారెడ్డిటౌన్/దోమకొండ/భిక్కనూరు/రామారెడ్డి/మాచారెడ్డి/కామారెడ్డిరూరల్: కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను రికార్డు మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు, ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కామారెడ్డి పట్టణంతో పాటు, దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి, రామారెడ్డి, కామారెడ్డి మండలాల పరిధిలో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని నేతలు అడిగారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మవద్దని సూచించారు.

### గోపాల్‌పేటలో పోలీసుల కవాతు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో మంగళవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి కవాతు(ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహించారు. ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు పాల్గొన్నారు.

### విధులను సక్రమంగా నిర్వర్తించాలి

ఎల్లారెడ్డి: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎల్లారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల విధులను నిర్వర్తించే వారు సక్రమంగా ఎన్నికల విధులను నిర్వర్తించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని ఎన్నికల అబ్జర్వర్ జగదీష్ షా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఆర్‌వో సురేష్ ఉన్నారు.

# అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ



రుద్రారంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్



ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్ సోదరి శోభ

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం, అల్మాజీపూర్, మల్కాపూర్, మత్తమాల, జంగమాయిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ..పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా గెలవగానే తాను ఎలాంటి కమీషన్లు లేకుండానే పనులు చేస్తానని దీనికి సంబంధించి బాండ్ పేపర్‌పై సంతకం చేసినట్లు తెలిపారు. వచ్చే జీతంలో ఒక రూపాయి మాత్రమే తీసుకుని మిగితా జీతాన్ని నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిస్తానని అన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు చెన్న లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆరిఫ్ తదితరులున్నారు.

**తమ్ముడి కోసం సోదరి ప్రచారం**

లింగంపేట(ఎల్లారెడ్డి): తమ్ముడిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మదన్‌మోహన్‌రావు అక్క శోభ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం ఆమే మండలంలోని ఎక్కపల్లిలో గడప గడపకు వెళ్లి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

### ఓటింగ్ ప్రక్రియపై అధికారులకు శిక్షణ

బాన్సువాడ రూరల్: శాసనసభ ఎన్నికల్లో భాగంగా బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పీవో, ఏపీవోలకు జనరల్ అబ్జర్వర్ లలిత్‌నారాయణ్ సింగ్, రిటర్నింగ్ ఆఫీసర్ భుజంగ్‌రావు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. అధికారులు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్స్ మిషన్ వినియోగంపై అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రారంభించడానికి ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్‌కు ముందే ఈవీఎం, వీవీప్యాట్స్ కనెక్షన్లు బ్యాలెట్ యూనిట్ సెట్టింగులను తనిఖీ చేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అవరోధాలు లేకుండా పనిచేయాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతు వ్యతిరేక బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలి



బీజేపీలో చేరుతున్న భిక్కనూరు ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు, నాయకులు

- కామారెడ్డి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి/రాజంపేట: రైతు వ్యతిరేక బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కామారెడ్డి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మాచారెడ్డి, రాజంపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి వేస్తే ఉరి అన్న ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని ఆరోపించారు.

ఉచితంగా యూరియా పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ హామీ అటకెక్కిందన్నారు. మోదీ ప్రభుత్వం యూరియా తయారీ పరిశ్రమలు పున: ప్రారంభించిందని చెప్పారు. తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని శపథం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, పార్టీ బీసీ ఉపాధ్యక్షుడు బాలరాజు, నర్సింహాచారి, సురేశ్ ఉన్నారు.

**బీజేపీలో చేరిన ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు**

భిక్కనూరు: మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బండి రాములుతో పాటు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బత్తుల లక్ష్మీనర్సింలు, బీఆర్‌ఎస్ నాయకులు కేవీ సుబ్బారాజులు, ముదిరాజ్ సంఘం సభ్యులు 450 మంది మంగళవారం బీజేపీలో చేరారు. వీరిని బీజేపీలోకి వెంకటరమణారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... నీతికి, నిజాయితీకి పట్టం కట్టేందుకు కామారెడ్డి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు ఉప్పరి రమేశ్, నర్సింలు ఉన్నారు.

# రామరాజ్యం రావాలంటే బీజేపీని గెలిపించాలి

- ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి



ఓటర్లను అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాష్ట్రంలో రామరాజ్యం రావాలంటే బీజేపీని గెలిపించాలని, అధికారంలోకి రాగానే వరి క్వింటాల్‌కు రూ.3100 మద్దతు ధర చెల్లిస్తామని ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోలిలింగాల, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్ తదితర గ్రామాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి నుంచి మనమంతా బతికి బట్టకట్టామంటే అది ప్రధాని మోదీ పుణ్యమేనన్నారు. కరోనాకు సకాలంలో టీకాను కనిపెట్టి దేశప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత బీజేపీదేనని చెప్పారు. గ్రామాలలో పేదలకు ఉచితంగా ఇచ్చే రేషన్ బియ్యం కేంద్ర ప్రభుత్వం చొరవేనన్నారు. అన్న పథకాలకు కేంద్ర ప్రభుత్వమే సగం నిధులను కేటాయించిందని చెప్పారు. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టిస్తామని చెప్పారు.

# కారు గెలవాలె.. కేసీఆరే సీఎం కావాలె



మల్లూర్‌లో మాట్లాడుతున్న హన్మంత్‌సింధే



మద్నూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- జుక్కల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): కారు గుర్తుకు ఓటేసి గెలిపించి కేసీఆర్‌ను మరోమారు సీఎం చేయాలని జుక్కల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మంగళవారం మల్లూర్, ఒడ్డేపల్లి, మాగి, బంజపల్లి, సుల్తాన్‌నగర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి సింధే మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన జుక్కల్‌ను ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. సెంటు భూమి ఉన్న నిరుపేదలకు కూడా కేసీఆర్ బీమా పథకం కింద రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తున్నామని చెప్పారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, మనోహర్, కాశీంసాబ్, విఠల్‌రెడ్డి, తదితరులున్నారు.

**బీఆర్‌ఎస్ గుర్తును మరిచిపోవద్దు**

మద్నూర్(జుక్కల్): ప్రజలు బీఆర్‌ఎస్ గుర్తు కారును మరిచిపోవద్దని, ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దరాస్ సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు డమ్మీ ఈవీఎం ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సంగీత, నాయకులు హన్మండ్లు, విజయ్, రవి, రమేష్, నాగేష్, తదితరులున్నారు.

# బాల్యవివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాధన సంస్థ ప్రతినిధులు, షీటీం సభ్యులు

రాజంపేట: మన దేశాన్ని బాల్య వివాహాలు లేని భారతదేశంగా నిర్మించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని, బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సాధన సంస్థ ప్రతినిధులను సంప్రదించాలని సాధన సంస్థ ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ కొప్పుల రవి అన్నారు. తలమడ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో సాధన సంస్థ ఆధ్వర్యంలో కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహాయంతో యాక్సిస్ టు జస్టిస్ ఫర్ ఆల్ ప్రొగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కొప్పుల రవి మాట్లాడుతూ..పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడినా, పిల్లల అక్రమ రవాణా జరిగినా, బాల్య వివాహాలు, పిల్లల వెట్టిచాకిరీ, తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లల కనపడితే చైల్డ్ 1098తో పాటు, 18001027222 నంబర్లకు ఫోని చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే షీటీం కానిస్టేబుళ్లు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, షీటీం కానిస్టేబుల్స్ సౌజన్య, భూమయ్య, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కానిస్టేబుల్ రాజేందర్, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.